క్లుప్తంగా

ఫైబర్ నెట్‌తో ఉద్యోగుల అవస్థలు



ఇలా..దర్శనమిస్తున్న వీడియో కాన్ఫరెన్స్ టీవీ

తాళ్లూరు: మండల కాంప్లెక్స్‌కు ఫైబర్ నెట్ సేవలు సక్రమంగా అందడం లేదు. నెట్ మరమ్మతులకు గుర్తైనా పట్టించుకునే దిక్కు లేదు. మండల స్థాయి అధికారులకు కూడా వారాల తరబడి నెట్ సేవలు అందడం లేదు. నిత్యం వివిధ రకాల వీడియో కాన్ఫరెన్స్‌లు జిల్లా స్థాయి అధికారులు నిర్వహిస్తుండటంతో వాటికి హాజరయ్యేందుకు తమకు దగ్గరలో ఉన్న మండలాలకు స్థానిక అధికారులు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా వివిధ పనులపై వచ్చిన ప్రజలకు అధికారుల ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి మండల కార్యాలయాలకు ఫైబర్ నెట్ సేవలు సక్రమంగా అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థిని ఎంపిక


బాలికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పుల్లలచెరువు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కె.గీతానాగేశ్వరి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు ఎంపికైనట్లు హెచ్ఎం ప్రభుజీ తెలిపారు. బుధవారం జెడ్పీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సీటు సాధించిన గీతానాగేశ్వరిని శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, లక్ష్మీనారాయణ, కోటేశ్వరరావు, కోటయ్య, లత, సిబ్బంది జానీబాషా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే అర్హత కలిగిన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యను అందించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

గిద్దలూరు రూరల్: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన స్థానిక నంద్యాల రోడ్డులోని జగనన్న కాలనీ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎస్.బయనపల్లె గ్రామానికి చెందిన స్వామిరంగయ్య బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో స్వామిరంగయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల నుంచి సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చదువు సాగేదెలా?

- ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత
- 124 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- ప్రైవేట్ పాఠశాలల వైపు విద్యార్థుల చూపు



పుల్లలచెరువు జెడ్పీ పాఠశాల

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. కూటమి ప్రభుత్వం విద్య పరంగా తీసుకునే నిర్ణయాలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. దీనికి తోడు పాఠశాలల్లో 2025–2026 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయుల కొరత ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటి వరకు జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో మండలంలోని పలు పాఠశాలల నుంచి ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడమేగానీ మండలంలోని పలు పాఠశాలలకు ఉపాధ్యాయులు బదిలీపై వచ్చింది లేదు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు ఆదరణ తగ్గింది.

ఉపాధ్యాయులు ఉండాల్సింది ఇలా..

పుల్లలచెరువు మండలంలో మూడు జెడ్పీ, నాలుగు యూపీ, 42 ఎలిమెంటరీ పాఠశాలలు ఉన్నాయి. పలు పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌లు 66 మంది అవసరం కాగా కేవలం 18 మంది మాత్రమే పనిచేస్తున్నారు. అదే విధంగా ఎస్‌జీటీలు 121 మంది అవసరం కాగా కేవలం 35 మంది పనిచేస్తున్నారు. మొత్తం 187 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా కేవలం 53 మంది ఉపాధ్యాయులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. మిగిలిన 124 మంది ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం 1998, 2008 బ్యాచ్‌లకు చెందిన కనీస వేతనం ఉపాధ్యాయులు ఆరుగురు మాత్రమే పనిచేస్తున్నారు. పుల్లలచెరువు జెడ్పీ పాఠశాలలో 400 మంది విద్యార్థులకు నలుగురు ఉపాధ్యాయులు మాత్రమే పనిచేస్తున్నారు. మర్రివేముల జెడ్పీ పాఠశాలలో 100 మంది విద్యార్థులు ఉన్నారు. ఆ పాఠశాలలో హెచ్ఎం, హిందీ ఉపాధ్యాయుడు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పాఠశాలలో పనిచేస్తున్న హెచ్ఎం ఈ నెలలో పదవీ విరమణ చేయనున్నారు.

ఆసక్తి చూపని ఉపాధ్యాయులు

జిల్లాకు చివరి మండలం కావడంతో పుల్లలచెరువులో పనిచేసేందుకు ఉపాధ్యాయులు ఆసక్తి చూపడం లేదు. ఉపాధ్యాయుల కొరతతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గింది. గతంలో ప్రతి పాఠశాలలో వందల సంఖ్యలో ఉండే విద్యార్థులు నేడు 3302 మంది విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారు. గతంలో దాదాపు 5 వేల మంది ఉండే వారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఈ మండలంపై జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోకుంటే సామాన్యులు చదువుకునే పరిస్థితి లేదని చెప్పవచ్చు.

> **డీఎస్సీతో టీచర్ పోస్టులు భర్తీ**
>
> మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు డీఎస్సీ ద్వారా భర్తీ చేయాల్సి ఉంది. బదిలీపై వెళ్లిన కొంత మంది ఉపాధ్యాయులు పాత స్థానాల్లో వచ్చి పనిచేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధ్యాయుల భర్తీ ఉంటుంది.
>
> – ఎస్ఎండీ షరీఫ్, ఎంఈవో–1, పుల్లలచెరువు

> **మంచి చదువు కావాలి**
>
> 
>
> ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా చదువు చెబుతున్నా ఇక్కడ సక్రమంగా ఉపాధ్యాయులు లేరు. దీంతో విద్యార్థులకు చదువు ఎలా వస్తుంది. పర్యవేక్షణ కూడా లేక పోవడంతో ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించాల్సి వచ్చింది. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునేందుకు ఖర్చు ఎక్కువైనా తప్పడం లేదు. విద్యార్థుల చదువు కోసం అప్పు చేయాల్సి వస్తోంది.
>
> – ఎస్.ఈశ్వరయ్య, పుల్లలచెరువు

> **ఉపాధ్యాయుల కొరత ఉంది**
>
> 
>
> ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ ఉచితంగా ఇచ్చినా ఉపాధ్యాయులు లేకుంటే విద్యార్థులకు చదువు ఎలా వస్తుంది. ప్రస్తుతం హైటెక్ యుగంలో ఉపాధ్యాయులు లేకుండా విద్యార్థులకు పాఠాలు ఎవరు చెబుతారు. గతంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా ఉండేది. ఈ విద్యా సంవత్సరం దారుణంగా ఉంది. ప్రతి పేదవాడు పిల్లలను బాగా చదివించాలనే ఆలోచనతో ఉంటారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధ్యాయుల కొరతగా ఉన్న పాఠశాలల్లో కనీస వేతనంపై వలంటీర్లను నియమిస్తే కొంత మేరకు విద్యార్థులకు మేలు జరుగుతుంది.
>
> – జి.గురునాథం, జెడ్పీ పాఠశాల మాజీ చైర్మన్, పుల్లలచెరువు

పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి

పుల్లలచెరువు: గ్రామాల్లో ప్రస్తుతం సాగు చేసిన మినుము, పెసర పంటల్లో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందని వ్యవసాయ విస్తరణాధికారి గోపీకృష్ణ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని సచివాలయం–1,2 పరిధిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మినుము, పెసర పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. ప్రతి రైతు యాజమాన్య పద్ధతుల గురించి తెలుసుకోవాలని చెప్పారు. ఖరీఫ్ 2025 క్రాఫ్ ఇన్సూరెన్స్ విధి విధానాలు ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. ఇందులో పంట కోతల ఆధారిత ఇన్సూరెన్స్ కింద వరి, కంది, నువ్వులు, మినుములు, సజ్జలు, మిరప పంటలను, వాతావరణ ఆధారిత ఇన్సూరెన్స్ కింద పత్తి, వేరుశెనగ పంటలను వర్తించినట్లు పేర్కొన్నారు. ఎంపీఈవోలు కోటేశ్వరరావు నాయక్, బ్రహ్మయ్య రైతులు పాల్గొన్నారు.


పుల్లలచెరువు: మినుము పంటను పరిశీలిస్తున్న ఎంపీఈవో

కురిచేడు: రైతులు సమగ్ర పోషక యాజమాన్య పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్ తెలిపారు. రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ, జీవన ఎరువులు కూడా వాడాలన్నారు. సమగ్రపోషక యాజమాన్యం పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లా నోటిఫైడ్ పంటలుగా వరి, కంది, సజ్జ, ఎండుమిర్చి, మినుము, నువ్వులు, పత్తి పంటను ఎంపిక చేసినట్లు తెలిపారు. పంటల బీమా ప్రీమియం చెల్లించాలనుకున్న రైతులు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి పంటల సాగు పత్రం తీసుకుని, దానితో పాటు పట్టాదారు పాస్‌పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్, ఆధార్ నంబర్‌కు లింకైన ఫోన్ తీసుకుని వెళ్లి ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు పంటల బీమా చెల్లించేందుకు చివరి తేదీ జూలై 31, వరి పంటకు ఆగస్టు 15వ తేదీ చివరి తేదీలుగా తెలిపారు.

మాదిగ మహామేళాను జయప్రదం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

దర్శి (కురిచేడు): ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ నాయకత్వంలో జూలై 7వ తేదీన ఒంగోలు మున్సిపల్ ఆడిటోరియంలో జరిగే మాదిగ మహామేళా సభను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షుడు రావినూతల కోటి మాదిగ కోరారు. దర్శిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణం వద్ద మదిగ మహామేళా కరపత్రాలు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంతో ఎస్సీ వర్గీకరణను సాధించుకొని ఆ ఫలాలను అన్ని ఉపకులాల వారికి అందించటంతో పాటు ఈ సమాజానికి ఒక ఉద్యమ స్ఫూర్తినిచ్చిన ఏకైక ఉద్యమ సంస్థ ఎమ్మార్పీఎస్ అని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వర్గీకరణ చేసిన రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్ కార్యాచరణ రూపొందించే విధంగా నిర్ణయాలు తీసుకునేందుకు అధిక సంఖ్యలో దర్శి నియోజకవర్గం నుంచి సభకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళితసేన వ్యవస్థాపకుడు గర్నిపూడి ప్రేమ్‌కుమార్, నవ్యాంధ్ర రాష్ట్ర మాదిగ డప్పు, చర్మ కళాకారుల అధ్యక్షుడు గోవింద ప్రసాద్, దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి గంథం ఇర్మియా, ఆలూరు నరేష్, అనపర్తి జఘన్య మాదిగ, నగరికంటి చంటి, రావినూతల కోర్నెలు, కూచిపూడి మధు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఆయేషా బేగం

దర్శి (కురిచేడు): పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ జిల్లా ఎస్పీ ఎస్.ఆయేషా బేగం ఆదేశించారు. దర్శి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఆమె బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం గురించి, కట్టాల్సిన లైసెన్సు ఫీజుల గురించి సమీక్షించారు. మద్యం షాపు లైసెన్సుదారులు నియమ నిబంధనలు కఠినంగా పాటించాలని, సమయపాలన పాటించాలని, ఎమ్మార్పీకే మద్యం అమ్మకాలు జరగాలని, బెల్టుషాపులు నిరోధించాలని సూచించారు. స్టేషన్ పనితీరుపై ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె వెంట ఒంగోలు అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పీఈ వెంకట్, దర్శి సీఐ కె.శ్రీనివాసరావు, ఎస్ఐ రఘుసత్యనారాయణ పాల్గొన్నారు.

పాలస్తీనాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధం ఆపాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

దర్శి (కురిచేడు): అమెరికా అండతో పాలస్తీనాపై ఇజ్రాయెల్ దేశం సాగిస్తున్న యుద్ధకాండను తక్షణమే ఆపాలని, ప్రపంచ శాంతిని కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. ప్రపంచ శాంతిని కోరుతూ దర్శి గడియార స్తంభం సెంటర్లో సీపీఎం కార్యకర్తలు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ నిన్నటి వరకు ఇరాన్‌పై ఇజ్రాయేల్, అమెరికా సాగించిన యుద్ధకాండ విచారకరమని పేర్కొన్నారు. 2023 అక్టోబర్‌లో ప్రారంభమైన యుద్ధం నేటికీ కొనసాగుతోందని, దాన్ని కూడా తక్షణం ఆపాలని కోరారు. పశ్చిమ ఆసియా ప్రాంతంలోని ఆయిల్ నిక్షేపాలపై పెత్తనం కోసం, ప్రపంచ ఆధిపత్యం కోసం అమెరికా ఆడుతున్న కపట నాటకాల్లో భాగంగానే ఈ యుద్ధం జరుగుతోందన్నారు. గతంలో ఇరాక్‌లో జీవ రసాయన ఆయుధాలు ఉన్నాయని, ఆ దేశంపై యుద్ధం ప్రకటించి సద్దాం హుస్సేన్‌ను హత్య చేశారన్నారు. ఇటీవల కాలంలో లిబియాలో కల్నల్ గడాఫీ ప్రభుత్వాన్ని కూల్చి ఆయన్ను హత్య చేశారని, సిరియా అధ్యక్షుడిని తరిమేసి తమ తాబేదారులతో అక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేశారన్నారు. అంతర్జాతీయ యుద్ధ నీతికి భిన్నంగా ఆస్పత్రులపై, శరణార్థి శిబిరాలపై, పసి పిల్లలపై కాల్పులు జరిపి చంపడాన్ని ఆయన తీవ్రగా ఖండించారు. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా, ఎక్కడ దోపిడీ, దౌర్జన్యం, అన్యాయం జరిగినా కమ్యునిస్టులుగా వాటిని ఖండిస్తామని, శాంతిని కోరుకుంటామని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తాండవ రంగారావు, ఈమని నాగేశ్వరరావు, చిరుపల్లి అంజయ్య, ఉప్పు నారాయణ, ఎస్.కాలేబాషా, గర్నిపూడి జాన్ సామ్యేల్, యోహోషువా, దానయ్య, ఎం.యల్లమందారెడ్డి, సీహెచ్ ఆదినారాయణ, కుందుర్తి అనిల్, తాండవ లక్ష్మి, అలూరి ఇజ్రాయేల్, అంజిబాబు, దాసు పాల్గొన్నారు.


వంట గదిని పరిశీలిస్తున్న అధికారులు


ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లోని ఆహార పదార్థాలు

ప్రమాదంలో ప్రజారోగ్యం!

- క్షేత్ర స్థాయిలో అమలు కాని ఆహార కల్తీ నిరోధక చట్టాలు
- మార్కెట్‌లోకి ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి లేని వస్తువులు?
- హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై పర్యవేక్షణ కరువు
- మార్కాపురంలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ పోస్టు ఖాళీ

మార్కాపురం టౌన్:

ఆహార కల్తీ ప్రజారోగ్యానికి పెను సవాలు విసురుతోంది. చట్టాల అమలులో ఉదాసీనత, అధికారుల నిర్లక్ష్యం కల్తీరాయుళ్లకు వరంగా మారింది. ఆరోగ్యం బాగోలేదని ఆస్పత్రులపాలవుతున్న వారిలో కల్తీ ఆహార బాధితులు సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గత ఏడాది గ్లోబల్ ఫుడ్ రెగ్యులేటర్స్ సమ్మిట్ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం వెల్లడించిన ఆహార భద్రతా సూచీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 28వ ర్యాంకు దక్కిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందేలా చూడటం ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) లక్ష్యం. అయితే ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి లేకుండానే బహిరంగ మార్కెట్‌లో ఆహార ఉత్పత్తులను విక్రయిస్తుండటం ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతోంది. ఆహార పదార్థాల కల్తీని నిరోధించేందుకు రూపొందించిన వంట నూనెల నియంత్రణ చట్టం, ఆహార కల్తీ నిరోధక చట్టం, నిత్యావసర సరుకుల నియంత్రణ చట్టం, పాల ఉత్పత్తుల నియంత్రణ చట్టం, ఆహార భద్రతా చట్టాలు క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్న ఆరోపణలున్నాయి. ఆహార కల్తీకి పాల్పడిన వారికి ఆరు నెలల నుంచి మూడేళ్ల వరకు జైలు శిక్షతోపాటు, భారీగా జరిమానా విధించేలా చట్టాల్లో పొందుపరిచినప్పటికీ ఎక్కడా అమలు కాకపోవడంతో కల్తీ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు.

ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ఎక్కడ?

మార్కాపురం పట్టణంలో ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి ఏళ్లు గడుస్తోంది. స్థానికంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లేకపోవడంతో తనిఖీలు చేసేవారు కరువయ్యారు. ఇదే అదనుగా భావించిన కొందరు వ్యాపారులు, హోటళ్లు, ఫాస్టుఫుడ్ సెంటర్ల నిర్వాహకులు తెలిసీతెలియకుండా నాసిరకం వస్తువులు వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మార్కాపురం డివిజన్ పరిధిలోని హోటళ్లు, తోపుడు బండ్లను తనిఖీ చేసి ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై పర్యవేక్షణ కరువు

పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గ కేంద్రాలతోపాటు పొదిలి, కంభం, బేస్తవారిపేట, ఇతర మండల కేంద్రాలు, మేజర్ పంచాయతీల్లో హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు సుమారు 500కు పైగానే ఉన్నాయి. ఆయా హోటళ్ల యజమానులు, బండ్ల నిర్వాహకులు ముడి సరుకుల కోసం హోల్‌సేల్ వ్యాపారుల పైనే ఆధారపడతారు. ఈ నేపథ్యంలో వ్యాపారులు విక్రయిస్తున్న సరుకులు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో వినియోగిస్తున్న వస్తువుల నాణ్యతను తరచూ తనిఖీ చేయాల్సి ఉన్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అవేవీ పట్టించుకోవడం లేదు. మార్కెట్‌లో తక్కువ ధరకు లభిస్తున్న వస్తువులు, నూనెలు, టేస్టింగ్ పేస్టులు, సాల్ట్‌లు, మసాలాలు ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతి ఉన్నవేనా కాదా అనే విషయంపై చిరు వ్యాపారులకు అవగాహన లేకపోవడంతో కల్తీ వస్తువులతో వండిన ఆహారం ప్రజల చెంతకు సులువుగా చేరుతోంది.

ఆహార ప్రమాణాలను పాటించకపోవడంతో పాటు, రుచికోసం నాసిరకం ఆయిల్స్, మసాలాలు, టేస్టింగ్ సాల్ట్‌లను పరిమితికి మించి వాడటంతో తినేటప్పుడు రుచికరంగా ఉన్నా ఆ తరువాత కడుపులో మంట, గ్యాస్ సమస్యలకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, యువకులు తోపుడు బండ్లపై చిరుతిళ్లకు అలవాటుపడుతుండటంతో బాల్య దశలోనే అనారోగ్యానికి గురవుతున్న పరిస్థితి ఏర్పడింది.

గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు

మార్కాపురం: గంజాయి అమ్మినా, కొనుగోలు చేసినా వారిపై కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరెడ్డి హెచ్చరించారు. మండలంలోని రాయవరం, డ్రైవర్స్ కాలనీ, ఎస్టేట్, గజ్జలకొండ గ్రామాల్లో పాత నేరస్తుల ఇళ్లు, మద్యం దుకాణాలను ఎస్సై గోపాలకృష్ణ, సిబ్బందితో కలిసి బుధవారం తనిఖీ చేశారు. రాయవరం పలువురు పాత నేరస్తులకు, బడ్డీ బంకుల నిర్వాహకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరకు మద్యం విక్రయిస్తే దుకాణాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు. మద్యం షాపుల్లో సమయపాలన పాటించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు.


బడ్డీ బంకును తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ సీఐ, ఎస్సై